# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేదీ : 31-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థ అని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలకు ఆంధ్రప్రదేశ్‌కి అదనంగా 6 కోట్ల 50 లక్షల పనిదినాలు కేంద్రప్రభుత్వం కేటాయించిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం 2 వేల 787 కోట్ల 41 లక్షల రూపాయలను విడుదల చేసింది.**
5. **తెలంగాణలో రైతు ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ రుణమాఫీ చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు.**

==========================

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించి 48.21 లక్షల కోట్ల రూపాయలతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్‌కు నిన్న లోక్‌సభ ఆమోదం తెలిపింది. అంతకుముందు బడ్జెట్‌పై జరిగిన చర్చకు లోక్‌సభలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిచ్చారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థ అని పేర్కొన్నారు. ద్రవ్యలోటును ప్రస్తుత ఏడాదికి స్థూల దేశీయోత్పత్తి-జీడీపీలో 4.9 శాతానికి, వచ్చే ఏడాదికి 4.5 శాతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (30 సెకెన్లు)

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు సత్వర సేవల కోసం ఏర్పాటైన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సాంఘిక సంక్షేమ శాఖ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సర్వీసులను సమర్థవంతంగా అమలు

చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో సచివాలయల సిబ్బంది సేవలను వినియోగించుకోని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసే లా చర్యలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి అదనంగా 6 కోట్ల 50 లక్షల పనిదినాలు కేటాయించిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదట మంజూరు చేసిన 15 కోట్ల పనిదినాలు జూన్ నెలాఖరుకే పూర్తయినట్లు పేర్కొన్నారు. అదనపు అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనిదినాల పెంపునకు రాష్ట్ర విజ్ఞప్తి మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ స్పందించిందని తెలిపారు. పెరిగిన పని దినాల వల్ల ఉపాధి హామీ పథకంలో పని చేసే 54 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. కూలీలకు చెల్లించాల్సిన బకాయిల సత్వర విడుదలకు కేంద్ర ప్రభుత్వం సమ్మతించిందని తెలిపారు.

---------------------------

తెలంగాణలో రైతు ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ రుణమాఫీ చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో రెండో విడత పంట రుణాల మాఫీ నిధులను ముఖ్యమంత్రి విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఆర్థిక చేయూత అందించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలన్నీ మాఫీ చేశామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండో విడత రుణమాఫీ కింద సుమారు 6.4 లక్షల మంది రైతుల ఖాతాల్లో 6,190 కోట్ల రూపాయలను జమ చేశామని తెలిపారు. రెండు దశల్లో కలిపి ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో 12 వేల 225 కోట్ల రూపాయలను జమ చేశామని ముఖ్యమంత్రి వివరించారు.

ఇలా ఉండగా రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... తెలంగాణలో పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని తెలిపారు. ఒకే పంటకాలంలో 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నామన్నారు. ఆయిల్‌పామ్ సరఫరాలో రాబోయే ఐదేళ్లలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంటుందని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్య క్రమాన్ని ఆగస్టు 1న ఉదయం ఆరు గంటలకే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. నిన్న రాష్ట్రంలో పింఛన్ల పంపిణీపై రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో దృశ్యమాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆగస్టు నెలకు సంబంధించి 64 లక్షల 82 వేల మందికి వివిధ రకాల పింఛన్ల పంపిణీకిగాను 2 వేల 787 కోట్ల 41 లక్షల రూపాయలను విడుదల చేసినట్లు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది 1వ తేదీ ఇంటింటికి వెళ్లి 96 శాతం పింఛన్ల పంపిణీ చేయాలని, 2వ తేదీన నూరుశాతం పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా బిష్ణు దేవ్ వర్మ ఈరోజు సాయంత్రం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. బిష్ణు దేవ్ వర్మ 2018-23 సంవత్సరాల్లో త్రిపుర ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. కాగా.. ఇటీవలే ఆయనను తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కు మరో పతకం దక్కింది. నిన్న జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీం విభాగంలో మనుబాకర్– సరబ్‌జోత్ సింగ్ జోడి దక్షిణ కొరియా పై గెలుపొంది కాంస్యం సాధించారు. మనుబాకర్ జోడి 16 పాయింట్లు సాధించగా దక్షిణ కొరియా నుండి ప్రాతినిధ్యం వహించిన లీ–యెజన్ జట్టు 10 పాయింట్లు సాధించింది. ఇలా ఉండగా మనుబాకర్ ఇప్పటికే వ్యక్తిగత విభాగం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్లో కాంస్య పతకం సాధించారు. దీంతో స్వాతంత్యం తర్వాత ఒకే ఒలింపిక్స్లో రెండు పతకాలు సాధించిన భారత అథ్లెట్ గా ఆమె చరిత్ర సృష్టించారు. భారత్‌కు మరో పతాకాన్ని అందించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు ఈరోజు టేబుల్ టెన్నిస్, విలువిద్య, బాక్సింగ్, బ్యాడ్మింటన్, షూటింగ్, ఈక్వెస్ట్రియన్ వంటి క్రీడా విభాగాలలో భారత క్రీడాకారులు పోటీపడనున్నారు.

---------------------------

ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగంలో ఆగస్ట్ 1వ తేదీ నుండి రాత్రి 8 గంటల 30 నిమిషాలకు 'జాతీయ వార్తలు' పేరిట కొత్త న్యూస్ బులెటిన్ ప్రారంభం అవుతోందని ఆకాశవాణి వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి తెలిపారు. ఈ న్యూస్ బులెటిన్ ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగంలో రెండవదిగా పేర్కొన్నారు. ఈ బులెటిన్ రాత్రి ఎనిమిదిన్నర గంటల నుండి ఎనిమిది గంటల నలభై నిముషాల వరకూ ప్రతీ రోజూ ప్రసారం అవుతుందని తెలిపారు. ఇక సాయంత్రం ఆరు గంటల పది నిముషాల నుండి ఆరు గంటల ఇరవై నిముషాల వరకు ప్రసారమయ్యే ప్రాంతీయ వార్తలు యధాతథంగా కొనసాగుతాయని వివరించారు. ఆకాశవాణి శ్రోతలు కొత్త న్యూస్ బులెటిన్‌ని కూడా ఆదరించాలని శ్రీసాయి వెంపాటి కోరారు.

ఇలా ఉండగా రొమ్ము క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, చికిత్సా విధానాలపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక చర్చా కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణ విద్యుత్ విచారణ కమిషన్ కొత్త చైర్మన్ గా జస్టిస్ మదన్ భీమరావ్ లోకూర్ నియమితులయ్యారు. తెలంగాణలో విద్యుత్ కొనుగోలుపై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై విచారణ చేయడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ కమిషన్, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. భీమ్‌రావు లోకూర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తిగా, ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కూడా పనిచేశారు.

---------------------------

తెలంగాణలో యువతకు అధునాతన పరిజ్ఞానం అందించడంతో పాటు నైపుణ్యాలను పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్న నైపుణ్య విశ్వవిద్యాలయం బిల్లును నిన్న ఆయన శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ విశ్వవిద్యాలయాన్ని ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా తెలంగాణలో ఆర్థికాభివృద్ధితో పాటు ఉద్యోగ కల్పన దిశగా ప్రభుత్వం ముందడుగు వేసిందని చెప్పారు. నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఆర్థిక ప్రణాళికల వ్యూహాత్మక పెట్టుబడి అని మంత్రి తెలిపారు.

=====================